ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

శుక్రవారం 6 సెప్టెంబరు 2024





బాపట్ల : పోతార్లంక గ్రామంలో ఇంకా ముంపులోనే పసుపు పైరు

వీడిన వరద.. ఇళ్లకు జనం

కృష్ణమ్మ కన్నెర్ర నుంచి ప్రజలు కోలుకుంటున్నారు. ముంపు నుంచి లంకలు, తీర ప్రాంత గ్రామాలు తేరుకుంటున్నాయి. వరదలతో ఇతర ప్రాంతాల్లో ఆశ్రయం పొందిన వారు ఇళ్లకు చేరుకుంటున్నారు. పేరుకుపోయిన బురద, కోల్పోయిన ఆస్తులను చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. కృష్ణమ్మ బీభత్సంతో అపారనష్టం నెలకొంది. సర్వం కోల్పోయిన బాధితులు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. నష్టాల అంచనాలకు ప్రత్యేక బృందాలను ప్రభుత్వం రంగంలోకి దింపింది. పంటలు, ఆస్తుల పరిశీలనలో ఆయా బృందాలు నిమగ్నమయ్యాయి. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కేవలం వరి పంట ఒక్కటే 1,88,363 ఎకరాల్లో దెబ్బతిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అంచనాలకు అందని విధంగా లంక గ్రామాలు భారీ నష్టాన్ని చవిచూశాయి. కొన్ని లోతట్టు ప్రాంతాలు వరద ముంపులోనే ఉన్నాయి. ఆ ప్రాంతాల్లోని ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాలన్నీ చెత్తా చెదారాలతో నిండిపోగా పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

- తేరుకుంటున్న లంక గ్రామాలు
- నష్టంపై అంచనాల్లో ప్రత్యేక బృందాలు
- రూ.వెయ్యి కోట్లకుపైగానే పంటలు కృష్ణార్పణం
- ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ప్రారంభం
- వాణిజ్య పంటలు ఒక్క ఎకరా దక్కదని రైతన్న ఆవేదన
- సర్వం కోల్పోయిన బాధితులు సాయం కోసం ఎదురుచూపు



రేపల్లె: వెల్లటూరు సమీపంలో వరద తాకిడికి కుళ్ళిపోయిన పసుపు దుంపలను చూపెడుతున్న రైతు



రేపల్లె : పెనుమూడి పల్లెపాలెంలో గృహం పూర్తిగా వరదలో కొట్టుకుపోవటంతో రోడ్డుపైనే జీవనం సాగిస్తున్న కుటుంబం



క్రోసూరులో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు



అమరావతి: రహదారికి మరమ్మతులు చేయిస్తున్న పెదమద్దూరు టీడీపీ నాయకులు



అమరావతిలో పంటనష్టాన్ని లెక్కిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



రేపల్లె: వరద పోటు కారణంగా ఛిద్రమైన మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం



కొల్లూరు: పసుపు పైరును వీడని వరద ముంపు

రేపల్లె/ తెనాలి, బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరద ముంపు బారిన పడిన గ్రామాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. కృష్ణమ్మ కరుణించటంతో వరద తగ్గుముఖం పట్టింది. తీర ప్రాంత వాసులు కొంతమేర భయాన్ని వీడి ముప్పు నుంచి బయటపడ్డ గ్రామాల్లోకి పయనమవుతున్నారు. కృష్ణమ్మ మహోగ్రంతో అతలాకుతలమైన లంక గ్రామాలు ఇప్పుడిప్పుడే వరద ముంపు నుంచి బయట పడుతున్నాయి. కృష్ణమ్మ కన్నెర్రతో ఐదు రోజులుగా నీటిలో మునిగిపోయిన గృహాలను చూసుకునేందుకు ప్రజలు గురువారం తరలివచ్చారు. కరకట్టవెంబడి ఉన్న గ్రామాల్లోని ప్రజలు సామగ్రిని తీసుకుని గృహాలకు పయనమయ్యారు. గృహాలు కోల్పోవటంతో ఎక్కడ ఉండాలా అని ఆలోచనలో పడ్డారు. గురువారం ఉదయం బాపట్ల, కొల్లూరు, రేపల్లె మండలాల్లో కురిసిన వర్షం ఆయా గ్రామాల ప్రజలను ఆందోళనకు గురిచేసింది. అయితే కొద్దిసేపటికే ఐదు రోజులుగా మాయమైన ఎండ జాడ కానరావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వరద వీడటంతో చోటుచేసుకున్న నష్టం వెలుగు చూస్తోంది. ప్రభుత్వ, ప్రజల ఆస్తులు భారీగా దెబ్బతిన్నాయి. లంక గ్రామాల్లో రహదారులు చాలా చోట్ల వరద ఉధృతికి కోతకు గురయ్యాయి. వరద పంటలతో పాటుగా గృహాల మీద నుంచి ప్రవహించడంతో కనివినీ ఎరుగని రీతిలో ప్రజలు నష్టపోయారు. సన్న చిన్నకారు కూలీ చేసుకునే కుటుంబాలకు చెందిన పూరి గుడిసెలు నేల కొరగటంతో కన్నీటిపర్యంతమయ్యారు. వరద వల్ల కొట్టుకువచ్చిన వ్యర్థాలన్నీ ఆయా గ్రామాలు, లంకల్లోని రోడ్లపైన దర్శనమిస్తున్నాయి. డ్రిప్‌పైపులతో పాటు తాడిచెట్లు, అరటి చెట్లు రహదారుల వెంట పొలాల్లో దర్శనమిస్తున్నాయి. వీటన్నింటిని తొలగించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పారిశుధ్య సిబ్బంది సరిపోవడం లేదు. వాణిజ్య పంటలు ఉరకెత్తిపోయి రూపురేఖలు కోల్పోతున్నాయి. అరటి తమలపాకు, బొప్పాయి, పసుపు, కంద పంటలలో వరద నీరు ఇంకా బయటకు వెళ్లలేదు. ఆయా తోటల్లో నీరు బయటకు వెళ్లాలంటే రహదారులకు గండి కొట్టాల్సిందేనని రైతులు పేర్కొంటున్నారు. లంకల్లో ఉద్యాన పంటలు ఏమీ మిగలలేదు. చేతికందివచ్చే దశలో ఉన్న పంటలు కూడా నీటిపాలయ్యాయి.

మొత్తం మీద రూ.వెయ్యికోట్లపైనే పంటల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. నష్టం అంచనాలు తేలితే ఇది రెట్టింపు ఉంటుందనేది రైతుల వాదన. ప్రకాశం బ్యారేజి దిగువున కేవలం రెండు మండలాల్లో ఉద్యాన పంటల నష్టం అంచనా వేస్తేనే రూ.100 కోట్లపైన ఉందంటే, బ్యారేజి ఎగువున, దిగువునున్న మిగిలిన మండలాల్లో లెక్కకడితే దీనికి మూడురెట్లు పెరగొచ్చనేది అంచనా. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కేవలం వరి ఒక్కటే 1,88,363 ఎకరాల్లో దెబ్బతిందని అంచనా వేశారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో అరటి, కంద, పసుపు, తమలపాకు, జామ తోటలు మొత్తం 8,535 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనా. వాణిజ్య పంటలు 90 శాతం వరకు పెట్టుబడులు పెట్టేసి, దిగుబడి కోసం ఎదురుచూస్తుంటే, వరికి కూడా సగంపైనే పెట్టుబడులు పెట్టేశారు. కరకట్ట వెంబడి ఉన్న పెనుమూడి, మైనేనివారిపాలెం, లంకేవానిదిబ్బ ఎస్టీ కాలనీ పూర్తిగా గృహాలు దెబ్బతిన్నాయి. మోర్తోటముక్తేశ్వరస్వామి దేవాలయం వరద తాకిడికి ముందుభాగమంతా కొట్టుకుపోయి ముఖమండపం దెబ్బతింది. రేపల్లె మండల పరిధిలోని పెనుమూడి పల్లెపాలెం, రావిఅనంతవరం, వేణుగోపాలస్వామిగుడి, వెల్లటూరు లంకగ్రామాలు అరటితోటలు వరద ముంపు నుంచి బయటపడ్డాయి.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి..

లంక గ్రామాలతో పాటు వరద ముంపునకు గురైన ప్రాంతాలన్నీ దాదాపుగా తేరుకోవడంతో అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులపై అధికారులు దృష్టి సారించారు. వరద ప్రవాహం తగ్గిన ప్రాంతాల్లో ఇళ్లు,రోడ్లు శుభ్రం చేసేందుకు పెద్ద ఎత్తున సిబ్బంది రంగంలోకి దిగారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు తాగునీటి విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందిని కూడా గ్రామాల్లో మోహరించి ఇంటింటి ఆరోగ్య సర్వే కూడా చేపడుతున్నారు. పారిశుధ్య పనులపై ఫిర్యాదుల నేపథ్యంలో బాపట్ల కలెక్టర్ స్వయంగా కొల్లూరు మండలం ఆవులవారిపాలెంలో పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు.

నష్టం అంచనాల్లో నిమగ్నం..

వరదలు తగ్గుముఖం పట్టి ముంపులో ఉన్న పొలాలు, ఊళ్లు బయటపడుతుండడంతో క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలకు సర్వే బృందాలను ప్రభుత్వం రంగంలోకి దించింది. ఆస్తులు, పంటలకు జరిగిన నష్టం అంచనాల గణనకు ప్రత్యేక బృందాలు శాఖల వారీగా రంగంలోకి దిగాయి. ఇళ్లలో జరిగిన నష్టానికి సంబంధించి రెవెన్యూ యంత్రాంగం ఇంటింటికి తిరిగి లెక్కలు వేస్తుండగా, పంటలను వ్యవసాయ, ఉద్యానశాఖలు సేకరిస్తున్నాయి. బాపట్ల జిల్లా వ్యాప్తంగా 151 గ్రామాలకు గాను 151 బృందాలు పంట నష్టం గణనకు పనిచేయనున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ముంపు బారి నుంచి వ్యవసాయ, ఉద్యాన పంటలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. ఉద్యాన పంటలు ఒక్క ఎకరం కూడా దక్కవని రైతులు చెబుతుంటే, పల్లపు ప్రాంతాల్లోని వరి పంట పనికిరాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను తొలగించడానికి అదనపు ఖర్చవుతుంటే, రెండో పంట వేసుకోవడానికి మళ్ళీ పెట్టుబడి అవసరం ఉంటుంది. వేమూరు మండల పరిధిలో ఐదు రోజుల నుంచి పొలాల్లోనే నీరు ఉండటంతో వరి నాట్లు పూర్తిగా కుళ్ళిపోయాయి.



రావిఅనంతవరంలో వరద సమయంలో నాడు నీట మునిగిన వేణుగోపాలస్వామిగుడి



నేడు వరద తగ్గటంతో బయటపడ్డ వేణుగోపాలస్వామి గుడి

బాబు భరోసా కోసం..

- లంక గ్రామాల్లో పర్యటించనున్న సీఎం

నిండా మునిగి.. సర్వం కోల్పోయి.. సాయం కోసం కృష్ణమ్మ వరద బాధితులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రెక్కల కష్టం, ఏళ్లుగా కూడబెట్టుకున్న ఆస్తులతో పాటు తిండి గింజలు, నిత్యావసరాలను కృష్ణమ్మ మింగేయగా కట్టుబట్టలతో నిరాశ్రయులైనవారు ఎందరో. ఇలాంటి వారందరూ మళ్లీ బతికి బట్టకట్టాలంటే ప్రభుత్వ సాయం తప్పనిసరి. కృష్ణా తీరంలో వరదలకు పంటలు, ఊళ్లకు ఊళ్ళు మునిగిపోయిన నేపథ్యంలో బాధితులకు భరోసా ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు లంక గ్రామాల పర్యటనకు రానున్నారు. పర్యటన సందర్భంగా సాయం ప్రకటించే అవకాశం ఉంది. అయితే నిండా మునిగిన తమకు ఉదారంగా సాయం చేయాలని చంద్రబాబును బాధితులు వేడుకుంటున్నారు. రెండో పంట వేయడానికి ప్రోత్సాహం అవసరమని, లేకుంటే మళ్లీ సాగు చేపట్టలేమని కన్నీటి పర్యంతమవుతున్నారు. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన వారిని ఆదుకోవాలని కోరుతున్నారు. చేతికంది వచ్చిన పంటలతో పాటు ఇప్పటికే వేలల్లో పెట్టుబడితో వేసిన పంటలు దక్కలేదని, ఈ పరిస్థితుల్లో పెట్టుబడితో పాటు రాయితీ కావాలంటున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై ఇస్తే మళ్లీ పంట వేయగలుగుతామని ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

అధైర్యపడకండి.. ఆదుకుంటాం

- రైతులతో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

ఊహించని భారీ విపత్తు.. భారీ నష్టం వాటిల్లింది. భారీ పెట్టుబడి పెట్టి, పంట చేతికందే దశలో నీటిపాలైంది.. అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం.. అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైతులకు హామీ ఇచ్చారు. గురువారం కొల్లిపర మండలంలో ఆయన పర్యటించారు. వరదకు దెబ్బతిన్న పసుపు, అరటి, కంద, నిమ్మ, కూరగాయల పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి నష్టం గురించి తెలుసుకున్నారు. జరిగిన నష్టానికి సంబంధించి కేంద్రం నుంచి సాయం అందించేందుకు కృషి చేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. పంట నష్టంతోపాటు, విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించేందుకు కేంద్ర సాయాన్ని కోరతానన్నారు.



కొల్లిపర: వల్లభాపురంలో వరదకు పసుపు దెబ్బతిందని కేంద్ర మంత్రి పెమ్మసాని, మాజీ మంత్రి ఆలపాటికి తెలుపుతున్న రైతులు



సీఎం రిలీఫ్ ఫండ్‌కి రూ. కోటి విరాళం అందజేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



కొండ వీడుకోట ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలను డీఎఫ్‌వో రామచంద్రరావుతో కలసి పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



కొల్లూరు: వరద ఉధృతికి కోతకు గురైన రహదారి

నేడు వేమూరుకు చంద్రబాబు?

వేమూరు: కృష్ణానది పరివాహక లంక గ్రామాల్లో పర్యటించి వరద బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం వేమూరు నియోజకవర్గానికి రానున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి గురువారం వస్తారని తొలుత భావించిన అధికారులు వేమూరు మార్కెట్ యార్డు సమీపంలో హెలీప్యాడ్‌పై దిగేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే వాతావరణం అనుకూలించని కారణంగా ముఖ్యమంత్రి పర్యటన వాయిదా పడింది. అయితే శుక్రవారం చంద్రబాబు వస్తారన్న ఉద్దేశంతో వేమూరులోని హెలీప్యాడ్ వద్ద మార్కింగ్ చేసి సమీపంలో అధికారులు జంగిల్ క్లియరెన్స్ చర్యలు చేపట్టారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని లంక గ్రామాల్లో నీట మునిగిన పైర్లను పరిశీలించి, బాధిత కుటుంబాలను చంద్రబాబు పరామర్శించనున్నారు. అనంతరం రాత్రికి వేమూరులో బస చేసి శనివారం ఉదయం రేపల్లె పర్యటనకు వెళ్లే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

వేమూరులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్





కొల్లూరు: రావిఅనంతవరంలో నాడు వరదనీటిలో నానుతున్న అరటితోట



నేడు వరద ఉధృతి తగ్గటంతో బయటపడ్డ అరటితోట

ఊపందుకున్న వరి సాగు

- ఇప్పటికే 35 వేలకుపైగా ఎకరాల్లో నాట్లు
- కుడి కాల్వకు 6,960 క్యూసెక్కుల నీటి సరఫరా



గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో నీటి ప్రవాహం



వరి నాటుకు దమ్ము..



వరినారు పీకుతున్న మహిళలు



వరి నాట్లు వేస్తున్న మహిళలు

నరసరావుపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వద్దన్నా వర్షాలు.. పుష్కలంగా సాగునీటి సరఫరాతో నాగార్జున సాగర్ ఆయకట్టులో వరి సాగు ఊపందుకుంది. 1,05,239 ఎకరాల్లో వరి సాగు అవుతుందని వ్యవసాయ, నీటి పారుదల శాఖలు అంచనా వేశాయి. ఇప్పటికే 35 వేలకు పైగా ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. కాల్వల ఎగువ ఆయకట్టులో వరి నాట్లు సాగుతున్నాయి. దిగువ ప్రాంతాల్లో రైతులు వరి నారు మళ్ల సాగు చేస్తున్నారు. సాగర్ జలాశయంలో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరింది. బుగ్గవాగు నుంచి కుడి కాల్వకు 6,960 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తు న్నారు. నీటి సరఫరా పెరగడంతో వరి సాగు పనులు వేగవంతమయ్యాయి. రైతులు, కూలీలు సాగు పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. రైతులు ట్రాక్టర్లతో దమ్ము చేయడం, దుక్కులు దున్నడం తదితర పనులు ముమ్మరంగా చేపట్టారు. వ్యవసాయ పనిముట్లు తయారు చేసే వారికి కూడా చేతినిండా పని లభిస్తున్నది. దమ్ము చక్రాలు, నాగళ్ళు తయారీ నరసరావుపేటలో విస్తృతంగా జరుగుతుంది. పనుల కోసం వ్యవసాయ కార్మికులు గతంలో పట్టణాలకు వలసలు వెళ్లే వారు. అయితే ప్రస్తుతం వరి సాగుతో గ్రామాల్లోనే కూలీలకు పుష్కలంగా పనులు లభిస్తున్నాయి. దీంతో కూలీల వలసలు తగ్గాయి. ఇతర జిల్లాల నుంచి వ్యవసాయ కార్మికులు, ట్రాక్టర్ల నిర్వాహకులు కూడా జిల్లాకు పెద్దసంఖ్యలో పనుల కోసం వలస వస్తున్నారు. ఈ నెలాఖరుకు వరి నాట్లు పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అంచనా. వరి నాట్లతో పుడమి ఆకుపచ్చ అందాలను సంతరించుకుంది. నాట్లు పూర్తయిన ప్రాంతాలు పచ్చని తివాచి పరిచినట్లుగా పచ్చతో తొణికిసలాడుతున్నాయి.

విద్యావిధాన రూపశిల్పి సర్వేపల్లి

- గురుపూజోత్సవంలో కలెక్టర్ అరుణ్‌బాబు
- 68 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 5: భారతీయ విద్యావిధాన రూప శిల్పి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక భువన చంద్ర టౌన్ హాల్‌లో గురుపూజోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన 68మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి వారిని ప్రత్యేకంగా సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో సర్వేపల్లి శిఖర సమానులన్నారు. ఐదారేడు తరగతుల్లో విద్యాబుద్ధులు నేర్పిన హరిబాబు అనే మాస్టారి కారణంగానే తాను ఈ స్థాయికి చేరుకున్నట్లు కలెక్టర్ చెప్పారు. పిల్లలకు చదువుతో పాటు జీవిత పాఠాలు నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని, ఆ వృత్తికి కళంకం తెచ్చేలా ప్రవర్తించ కూడదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ యుగాలు మారినా గురువులపై గౌరవం తగ్గదన్నారు. సరిగా లెక్కలు రాకపోతే ఓ ఉపాధ్యాయుడు తనను సైన్స్ మీద దృష్టి పెట్టాలని సలహా ఇవ్వడం వల్లనే తాను డాక్టర్ అయ్యానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉప విద్యాశాఖాధికారులు కె.వేణుగోపాలరావు, యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.



గురుపూజోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ పి.అరుణ్ బాబు, వేదికపై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



పదిహేనేళ్ల ప్రయాణం

అక్కినేని నాగచైతన్య తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి పదిహేనేళ్లు అయింది. ఆయన నటించిన తొలి చిత్రం 'జోష్' 2009 సెప్టెంబర్ 5న విడుదలైంది. ఈ పదిహేనేళ్ల ప్రయాణంలో విలక్షణమైన పాత్రలు ఎన్నో పోషించి, మంచి నటుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆ చిత్ర యూనిట్ ప్రత్యేకమైన పోస్టర్ విడుదల చేసింది. సముద్రం దగ్గర ఫిషింగ్ బోట్ మీద నిల్చుని చిరునవ్వు చిందిస్తున్న చైతు లుక్ ఆకట్టుకుంది. అల్లు అరవింద్ సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. బన్నీ వాస్ నిర్మాత.

ఎలాంటి సాయం కావాలన్నా చేస్తాం

డి.సురేశ్‌బాబు



తెలుగు రాష్ట్రాల్లో వరద ముప్పు బారిన పడిన బాధితుల కోసం ఇప్పటికే తెలుగు సినీ ప్రముఖులు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి భారీ మొత్తంలో విరాళాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. వరద బారిన పడిన కుటుంబాలను ఆదుకోవడానికి తెలుగు చలన చిత్రసీమ ప్రముఖులు గురువారం ఓ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిల్మ్ చాంబర్ గౌరవ కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ "ఫిల్మ్ చాంబర్ తరపున రూ.25 లక్షలు.. నిర్మాతల తరపున రూ.10 లక్షలు.. ఫెడరేషన్ తరపున రూ.5 లక్షలు రెండు తెలుగు రాష్ట్రాలకు విరాళంగా ఇస్తున్నాం" అని చెప్పారు. "మా దగ్గుబాటి కుటుంబం తరపున బాధితుల కోసం రూ.కోటి విరాళం అందజేస్తున్నాం. కేవలం డబ్బులే కాకుండా.. నిత్యావసరాలను కూడా పంపిణీ చేస్తాం. బాధితులకు ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని డి. సురేశ్‌బాబు అన్నారు. "మేమంతా ఈ స్థాయిలో ఉండటానికి కారణం.. మమ్మల్ని ఆదరించిన ప్రజలే. వరద బారిన పడిన వారందరినీ తప్పకుండా ఆదుకుంటాం" అని దర్శకుడు కె.రాఘవేంద్ర రావు తెలిపారు. "మా నిర్మాణ సంస్థ తరపున తెలంగాణకు రూ.25 లక్షలు.. ఆంధ్రప్రదేశ్‌కు రూ.25లక్షలు ప్రకటిస్తున్నాను. ఇండస్ట్రీలోని వారంతా ఈ సమయంలో ముందుకు వచ్చి విరాళాలు అందించాలి" అని నిర్మాత దిల్ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, ప్రసన్నకుమార్, జెమినీ కిరణ్, అశోక్ కుమార్, అనిల్ అమ్మిరాజు, భరత్ చౌదరి పాల్గొన్నారు.

దగ్గుబాటి కుటుంబం	రూ.కోటి
దిల్ రాజు	రూ.50 లక్షలు
ఫిల్మ్ చాంబర్	రూ.50 లక్షలు
నిర్మాతల మండలి	రూ.20 లక్షలు
ఫిల్మ్ ఫెడరేషన్	రూ.10 లక్షలు

32వ సినిమా విడుదలకు ముహూర్తం



విభిన్న కథాంశాలు ఎన్నుకొని వరుస హిట్స్‌తో దూసుకుపోతున్న నాని తన 32వ చిత్రం వివరాలు గురువారం ప్రకటించారు. 'హిట్ 3' చిత్రంలో తన లుక్‌ని, గ్లింప్స్‌ను విడుదల చేశారు. డాక్టర్ శైలేష్ కొలను ఈ సినిమాకు దర్శకుడు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. సిగార్ తాగుతూ, కారు నడుపుతూ రక్తపు చేతులు, గొడ్డలితో ఫెరోషియస్‌గా కనిపించారు నాని. 'హిట్ 3'లో ఆయన అర్జున్ సర్కార్‌గా కనిపించబోతున్నారు. ఈ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని దర్శకుడు చెప్పారు. 2025 వేసవి సందర్భంగా మే ఒకటిన సినిమాను విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. 'హిట్ 3' చిత్రానికి సాను జాన్ వర్గీస్ ఛాయాగ్రహణాన్ని, మిక్కీ జే మేయర్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

వినోదాన్ని పంచే సినిమా



ఫరియా అబ్దుల్లా నటించిన తాజా చిత్రం 'మత్తు వదలరా 2'. ఇది 2019 విడుదలై సూపర్ హిట్ అయిన 'మత్తు వదలరా' సినిమాకు సీక్వెల్. ఈ నెల 13న విడుదలవుతున్న సందర్భంగా ఫరియా మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా ఒక డిఫరెంట్ థ్రిల్లర్. ఎన్నో ట్విస్ట్‌లు, సర్‌ప్రైజ్‌లతో కూడిన కథ ఇది. ఇందులో పాత్రధారుల కష్టాల నుంచే కామెడీ పుడుతుంది. ఈ సినిమాలో సన్నిధి అనే స్పెషల్ ఏజెంట్ పాత్రలో కనిపిస్తాను. నాది యాక్షన్‌తో నిండిన పాత్ర. దర్శకుడు రితేష్ రాణాకు ఫిల్మ్ మేకింగ్‌లో చాలా అవగాహన ఉంది. ప్రతీ విషయంలో క్లారిటీగా ఉంటారు. కాలభైరవ ఇచ్చిన సంగీతం సినిమాకు అదనపు ఆకర్షణ. ఈ సినిమా మొదటి భాగం కంటే మరింత వినోదాన్ని పంచుతుంది. ప్రస్తుతం తిరువీర్‌తో ఓ ప్రేమకథలో నటిస్తున్నా. త్వరలోనే ఓ తమిళ చిత్రం కూడా మొదలవ్వబోతోంది" అని ఫరియా చెప్పారు.

మహిళల భద్రతకు కమిషన్ ఏర్పాటు చేయండి

మంచు విష్ణు



తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళల రక్షణ, భద్రత మెరుగుపరచడం కోసం ఇండస్ట్రీలోని మహిళలే ప్రాతినిధ్యం వహించేలా ఒక కమిషన్ వేయాలని 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

హేమ కమిటీ నివేదికపై ప్రత్యేక ధర్మాసనం

జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో నమోదైన కేసులపై విచారణ జరిపేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనాన్ని కేరళ హైకోర్టు ఏర్పాటు చేయనుంది. హేమ కమిటీ రిపోర్ట్‌ను బహిర్గతం చేయడానికి అనుమతిస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ ముస్తాఖ్, జస్టిస్ ఎస్. మను మదేతో కూడిన ధర్మాసనం మహిళా న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటుపై మౌఖిక ఆదేశాలు ఇచ్చింది.

సంస్కృత టీచర్స్‌కు అంకితం



రచయిత, దర్శకుడు జనార్థన మహర్షి 'శ్లోక' పేరుతో ఓ సంస్కృత చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రాగిణి ద్వివేది ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని జనార్ధన మహర్షి కుమార్తెలు శ్రావణి, శర్వాణి నిర్మాతలు. ఈ సినిమా గురించి జనార్ధన మహర్షి వివరిస్తూ 'సినిమాలోని కీలకమైన రుద్రభూమి సన్నివేశాలను బెంగళూరు, మైసూర్‌లో చిత్రీకరించాం. దేశంలోని పురాతనమైన అనేక శ్మశానాలలో షూటింగ్ చేశాం. సంస్కృతంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను అనేక భారతీయ భాషల్లోకి అనువదిస్తాం. గురువారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మా చిత్రాన్ని సంస్కృత టీచర్స్‌కు అంకితం ఇస్తున్నాం' అని చెప్పారు. ఈ సినిమాలో తనికెళ్ల భరణి కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఇన్ ప్రోగ్రెస్

రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



యువతరానికి నచ్చే అంశాలు, కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో రూపొందిన రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'రోటీ కపడా రొమాన్స్' అక్టోబరు 4న విడుదల కానుంది. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, కుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటించారు. విక్రమ్‌రెడ్డి దర్శకుడు. బెక్కెం వేణుగోపాల్, సృజన్‌కుమార్ బొజ్జం నిర్మాతలు. సినిమాలో ప్రతి పాత్ర యూత్‌కు కనెక్ట్ అవుతుందనీ, రొమాన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్ ప్రధాన బలాలు అని దర్శకుడు తెలిపారు. కొత్త పాయింట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందనీ, అది ఏ రేంజ్ అనేది ప్రేక్షకులు నిర్ణయిస్తారనీ నిర్మాతలు చెప్పారు.

స్పీడ్‌గా..



గణేశ్, హేమంత్, ప్రీతీ సుందర్, జాహ్నవి నటించిన 'స్పీడ్ 220' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో హీరోలిద్దరూ పోటీ పడి నటించారనీ, ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా అలరించే విధంగా సినిమా ఉంటుందని దర్శకుడు హర్ష బేజాగం తెలిపారు. కె.ఫణి, ఎం.సూర్యనారాయణ, ఎం.దుర్గారావు ఈ సినిమాను నిర్మించారు.

కలెక్టర్ సహాయనిధికి రూ. 28,40,710 విరాళాలు



కొల్లిపరలో పంటనష్టం వివరాలను అధికారులను అడిగితెలుసుకుంటున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆలపాటి రాజా

దెబ్బతిన్న ప్రతి రైతును ప్రభుత్వాలు ఆదుకుంటాయి

కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

కొల్లిపర, సెప్టెంబరు 5 : రైతుల కష్టాన్ని వెలకట్టలేమని, వరదలకు రైతులు నష్టపోవడం బాధాకరమని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలు అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, కొల్లిపర, బొమ్మువానిపాలెం గ్రామాల్లో ఆయన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, సబ్‌కలెక్టర్ సంజనాసింహాతో కలిసి పర్యటించారు. వరదకు దెబ్బతిన్న పసుపు, అరటి, కంద, నిమ్మ, కూరగాయల పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రకృతి విపత్తు వల్ల తలెత్తిన నష్టం తదితర అంశాలపై రైతులతో చర్చించారు. అలాగే సంబంధిత ప్రభుత్వ శాఖలు వ్యవసాయ, డ్రైనేజీ, ఇరిగేషన్ శాఖ అధికారులతో వరదకు, భారీ వర్షాలకు ఎంత నష్టం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రాప్ బుకింగ్, బీమా తదితర చర్యల ద్వారా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జారీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించే కాంపోనెంట్, సబ్సిడీ, బీమా తదితర ప్రభుత్వ పథకాల ద్వారా సహాయం అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత వరద నష్టం సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సహాయ చర్యలు చేపడతామన్నారు. వరదకు దెబ్బతిన్న ప్రతి రైతును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోనున్నట్లు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వరద కారణంగా లంకగ్రామాల్లో పంట నష్టం తీవ్రంగా జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన లంక గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటి రెడ్డి, టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వి.సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కె.అమృతరాజు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరద బాధితుల సహాయార్థం పలు స్వచ్ఛంధ సంస్థల నిర్వాహకులు, పారిశ్రామికవేత్తలు ఆర్థిక సాయం అందిం చేందుకు ముందు కొచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని వారు కలిసి విరాళాలను అందజేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రూ. లక్ష, తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్ రూ. 10 వేలు, బొమ్మిడాల శ్రీకృష్ణ మూర్తి ఫౌం డేషన్ రూ. 5 లక్షలు, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ రూ.1,70,710, నరేడ్కో క్యాపిటల్ జోన్ ఆంధ్రప్రదేశ్ రూ.10 లక్షలు, చెలికాని సీతారామయ్య ఆర్గానిక్స్-గుంటూరు రూ. 10 వేలు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్-అమరావతిరూ. 5 లక్షలు, శ్రీ వేంకటేశ్వర బాల కుటీర్ రూ. లక్ష, వివా ది స్కూల్-నంబూర్ రూ. లక్ష, నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ రూ.లక్ష, శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ రూ.50 వేలు, టాప్ కిడ్స్ స్కూల్ రూ. లక్ష, స్టెమ్ స్కూల్ రూ. లక్ష కలిపి మొత్తం గురు వారం నాటికి రూ. 28,40,710 కలెక్టర్ సహాయనిధికి అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దాతలను అభినందించారు.



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్ సభ్యులు



కలెక్టర్‌కు విరాళాలు అందజేసిన పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంధ సంస్థల నిర్వాహకులు

సింథటిక్ కంపెనీ రూ.10 లక్షలు అందజేత



బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళికి చెక్కు అందజేస్తున్న అబ్దుల్ సలాం

కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 5 : వరద బాధితులకు అత్యవసర సాయం కింద రూ.10 లక్షలు విరాళాన్ని అందించడం అభినందనీయమని కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. గురువారం ప్రకాశం జిల్లా మేదరమెట్లకు చెందిన సింథటిక్ కంపెనీ యాజమాన్యం వరద బాధితుల సహాయార్థం రూ.10 లక్షల విరాళాన్ని ప్రకటించింది. సంస్థ సీనియర్ మేనేజర్ అబ్దుల్ సలాంతో ఆ చెక్కును కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడానికి మరో రూ.90 లక్షలు ఇవ్వడానికి ఫ్యాక్టరీ యాజమాన్యం ముందుకు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

మల్లెల రాజేష్ నాయుడు విరాళం రూ.10 లక్షలు



విరాళపు చెక్కును మంత్రి లోకేష్ కు అందచేస్తున్న మల్లెల రాజేష్ నాయుడు

చిలకలూరిపేట, సెప్టెంబరు 5: వరద బాధితుల సహాయార్థం పట్టణానికి చెందిన ఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, తెలుగుదేశం నాయకుడు మల్లెల రాజేష్ నాయుడు గురువారం రు.10 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఆయన తన విరాళపు చెక్కును రాష్ట్ర మంత్రి లోకేష్ కు అందజేశారు. రాజేష్ నాయుడును ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు.

గుడిపూడి గ్రామస్తుల సాయం పదిలక్షలు

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 5 : విజయవాడ వరద బాధితుల కోసం మండ లంలోని గుడిపూడి గ్రామస్తులు తమ దాతృత్వాన్ని చాటు కున్నారు. సుమారు రూ 10 లక్షలను సేకరించి ఈ మొత్తం సహాయాన్ని చెక్కు రూపంలో గురువారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయనకు అంద జేశారు. సహాయం అందించిన వారిలో గ్రామానికి చెందిన చిగురుపాటి సాంబశివరావు రూ5 లక్షలు, సంగం డెయిరీ పాల కేంద్రం ద్వారా రూ 50వేలు, గ్రామంలోని ఐదు డ్వాక్రా సంఘాల ద్వారా రూ 50వేలు, మిగిలిన మొత్తాన్ని గ్రామస్తుల ద్వారా సేకరించి మొత్తం రూ 10 లక్షలను సీఎం చంద్రబాబుకు అంద జేశారు. కార్యక్రమంలో జి.అప్పారావు, ఎల్. గజానన, కె.పుల్లారావు, జి.అచ్యుత రామయ్య, జి.తాతారావు, జి.ఆంజనేయులు, ఎస్. శ్రీనివాసరావు, చిగురుపాటి సాంబయ్య, అమరనేని సుధాకర్ ఉన్నారు. ఈ మొత్తం ఆర్థిక సాయాన్ని నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచనల మేరకు సేకరించి వరద బాధితుల సహా యార్థం అందజేసినట్టు గ్రామస్తులు తెలిపారు.



రూ. 50 లక్షల చెక్కుని కలెక్టర్‌కు అందజేస్తున్న డ్వాక్రా గ్రూపుల మహిళలు, డీఆర్‌డీఏ, లీడ్‌బ్యాంకు అధికారులు

డ్వాక్రా గ్రూపుల మహిళల ఉదారత

- వరద బాధితులకు రూ. 50 లక్షల సాయం అందజేత
- మెప్మా ద్వారా మరో రూ. 30 లక్షలు

గుంటూరు సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయనిధికి జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలు తమ ఉదారతను చాటుకొన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా, డ్వాక్వా గ్రూపుల మహిళలు భారీగా విరాళాలు సేకరించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ - వెలుగు పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు రూ.50 లక్షలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ - వెలుగు పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు రూ. 30 లక్షల చెక్కులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, డీఆర్డీఏ పీడీ హరిహర నాథ్, లీడ్ డిస్ట్రిక్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, స్వయంసహాయక సంఘాల సభ్యులు అందించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ మాట్లాడుతూ జిల్లాలో డీఆర్‌డీఏ పరిధిలోని 20,632 స్వయం సహాయక సంఘాలు, మెప్మా పరిధిలోని 19,118 స్వయం సహాయక సంఘాలు వరదబాధితుల సహాయ నిధికి రూ. 1.25 కోట్లు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మిగతా ఆర్థిక సహాయం సోమవారం అంది స్తామని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు ఎస్అశోక్, రాంబాబు, నారాయణ, ఉషా, కీర్తి పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

సంతకాల ఫోర్జరీపై ఫిర్యాదు

సత్తెనపల్లి, సెప్టెంబరు 5 : మునిసిపల్ కమిషనర్, సర్వేయర్ సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ సర్టిఫికెట్‌ను తయారుచేసిన సంఘటన పట్టణంలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు.. సత్తెనపల్లికి చెందిన గొల్లపల్లి వెంకటరావుకు పట్టణంలోని 3,401 చదరపు గజాల ఖాళీ స్థలం పూర్వార్జితంగా సంక్రమించిందని.. దీనిని స్వాధీనం చేసుకొనేందుకు సర్టిఫికెట్ ఇప్పించాలని 2024 మార్చి 14న మునిసిపల్ కమిషనర్‌కు, సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, ఆ భూమి అతనిది కాదని తేలడంతో సర్వేయర్, కమిషనర్ అతనికి సర్టిఫికెట్ ఇవ్వలేదు. అయినప్పటికీ ఆ సర్వేయర్, కమిషనర్ ఆ స్థలం వెంకటరావదేనని నిర్ధారించినట్టు దొంగ సర్టిఫికెట్‌ను మార్చి 24, 2024న పుట్టించాడు. ఈ సర్టిఫికెట్‌లో సర్వేయర్, కమిషనర్ సంతకాలను ఫోర్జరీ చేశాడు. ఈ దొంగ సర్టిఫికెట్ విషయం బుధవారం మునిసిపల్ కమిషనర్, సర్వేయర్ దృష్టికి వెళ్ళింది. ఈ సర్టిఫికెట్ తామిచ్చింది కాదని గుర్తించారు. ఈ విషయమై మునిసిల్ సర్వేయర్ షఫీ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పట్టణ సీఐ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. తమ సంతకాలను ఫోర్జరీ చేసిన వెంకటరావు పై చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పొన్నూరులో వెండి దుకాణంలో భారీ చోరీ

- స్థానికుల అప్రమత్తతో దొరికిన దొంగలు
- రూ. 30 లక్షల చోరీ సొత్తు, వాహనం చంద్రగిరిలో స్వాధీనం
- తెనాలిలో మరో ఇద్దరు అదుపులోకి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు5: దొంగతనాలు చేయడంలో ఆరితేరిన ముఠా ఓ వెండి దుకాణంలో బుధవారం అర్ధరాత్రి భారీ చోరీకి పాల్పడి పోలీసులకు పట్టుబడిన సంఘటన పొన్నూరులో జరిగింది. అర్బన్ పోలీసులు, స్థానికులు, బాధితుల కథనం ప్రకారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌కు సమీపంలో తోటలమ్మ గుడి పక్కనే వెండి, బంగారు ఆభరణాల విక్రయించే ధనలక్ష్మీ జ్యూవెలర్స్ ఉంది. బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఈ దుకాణంలో షట్టర్లు పగలగొట్టి దుండగులు దుకాణంలోకి ప్రవేశించారు. సుమారు రూ. 30 లక్షల విలువైన 38 కిలోల వెండి అభరణాల చోరీకి పాల్పడ్డారు. చోరీ దృశ్యాలు సీసీ టీవీ కెమెరాలో రికార్డు అయ్యాయి.



సీసీ టీవీ కెమెరాలో రికార్డు అయిన చోరీ దృశ్యాలు

స్థానిక యువకుల అప్రమత్తతతో దుండగుల పట్టివేత

స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌కు సమీపంలోని షరాఫ్ బజార్‌లో కెజిఎస్ యూత్ పండుగలు నిర్వహిస్తూ వుంటుంది. మరో రెండు రోజులో వినాయకచవితి పండుగ నేపథ్యంలో కేజీఎస్ యూత్ సభ్యులు వినాయక మండపం ఏర్పాట్లు చేస్తున్నారు. కేజీఎస్ సభ్యులు రాత్రి వేళ మండపం నిరిస్తుండంగా సమీపంలోకి ధనలక్ష్మీ జ్యూవెలర్స్ వద్ద అలికిడి కావడం, తెల్లటి ఫార్చ్యూనర్ వాహనం హడావుడిగా రావడం.. వాహనం లో పలికి లోడింగ్ చేస్తూ గుర్తుతెలియనివ్యక్తులు ఉండటంతో .. యూత్ సభ్యులకు అనుమానం వచ్చింది. వెంటనే ఆ యువకులు అక్కడికి వెళ్లడంతో అది గమనించిన దుండగులు వాహనంలో పారిపోయేందుకు యత్నించారు. ఇద్దరు యువకులు ధైర్యం చేసి దుండగుల వాహనాన్ని



పొన్నూరు పోలీసులకు ఆభరణాలు అప్పగిస్తున్న చంద్రగిరి పోలీసులు

వెంబడించారు. దుండగుల్లో ఓ యువకుడు రతన్ సింగ్‌ని గట్టిగా పట్టుకుని బంధించే క్రమంలో వాహనంలోని మరో ఇద్దరు అతన్ని తప్పించేందుకు..వాహనం దిగి స్థానిక యువకులపైకి దాడికి యత్నించారు. దీనిని స్థానిక యువకులు ప్రతిఘటించడంతో దుండగులు పరారయ్యారు. వాహనంలోని వ్యక్తులు ఇద్దరు దొంగలను వదిలి కారులో పారిపోయారు. చోరీ సమాచారం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానిక యువకుల అదుపులో ఉన్న రతన్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ



పొన్నూరులో స్థానిక యువకుల అదుపులో ఉన్న రతన్‌సింగ్, చంద్రగిరిలో పోలీసులు అదుపులోకి తీసుకున్న బీహార్ దొంగలు

సంఘటనతో అప్రమత్తమైన పోలీసులు.. చోరీ జరిగిన గంటల వ్యవధిలోనే చోరీకి ఉపయోగించిన వాహనం, చోరీ జరిగిన సొత్తు, వాహన డ్రైవర్ ముకేష్ మలీని తిరుపతి సమీపంలోని చంద్రగిరిలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ చోరీలో పాలుపంచుకుని స్థానిక యువకులపై దాడికి దిగిన మరో ఇద్దరు సుమన్ కామిత్, విక్రమ్ సింగ్, ఉత్తమ్ సింగ్‌లను కూడా పోలీసులు తెనాలిలో అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో నింది తులను ప్రశ్నిస్తునట్లు తెలుస్తోంది.

గాదంకి టోల్‌ప్లాజా వద్ద పట్టుబడ్డ ఇద్దరు నిందితులు

నిందితుల్లో ఇద్దరు చంద్రగిరి మండలం గాదంకి టోల్‌ప్లాజా వద్ద పట్టుబడ్డారు. పొన్నూరులో చోరీ ఘటనలో కారులో పరారైన నలుగురు నిందితులను బెంగళూరుకు వెళుతున్నట్లు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా గుర్తించి చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో వెళ్లి గాదంకి టోల్‌ప్లాజా వద్ద నిఘా ఉంచారు. నిందితులు ప్రయాణిస్తున్న కారు గురువారం ఉదయం 10.30 గంటల సమ యంలో రాగానే టోల్‌ప్లాజా సిబ్బందితో కలిసి వారిని పట్టు కునే ప్రయత్నం చేశారు.

ఇద్దరు అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. కారును పరిశీలించగా, రూ.30 లక్షల విలువైన బంగారు, వెండి, రోల్డ్ గోల్డ్ ఆభరణాలు కనిపించాయి. కారుతో పాటు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను, కారు, ఆభరణాలను చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం పొన్నూరు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు గురువారం రాత్రి 10 గంటల సమయానికి చంద్రగిరికి చేరుకున్నారు. వీరికి ఇద్దరు నిందితులు, ఆభరణాలు, కారును చంద్రగిరి పోలీసులు అప్పగించారు.

నేటి నుంచి కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల సమ్మె

- జీఎన్ఎం చేసిన వారికి పోస్టులు ఇవ్వడంపై ఆగ్రహం



గుంటూరు జీజీహెచ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 5 : రాష్ట్రంలో ని వివిధ ప్రభుత్వ ఆసుపత్రిల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు మెరుపు సమ్మె కు దిగనున్నారు. శుక్రవారం నుండి తాము విధులకు హాజరు కాబోమంటూ డీడీలు,ఆసుపత్రి సూప రింటెండెంట్‌లకు గురువారం నోటీసులు ఇచ్చారు. ఏఎన్ఎం లుగా పనిచేస్తున్న వారికి జగన్ ప్రభు త్వంలో జీఎన్ ఎం గా శిక్షణ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ కోర్సు ను కుదించి శిక్షణ ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు వారికే రూ. ఐదువేలు అదనపు పారితోషకం గా చెల్లించి స్టాఫ్ నర్సు పోస్టు ల్లో నియ మించేందుకు వైద్య ఆరోగ్య శాఖ తాజాగా జీఓ జారీ చేసింది. రెగ్యులర్ పోస్టు ల్లో స్టాఫ్ నర్సు పోస్టు ల్లో ఎన్ఎం శిక్షణ పొందిన వారిని నియమించడం వల్ల గత 15 ఏళ్లు గా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని బాధి తులు చెబుతున్నారు. జీఓ రద్దు చేసే వరకు తాము సమ్మె చేస్తామని తెలిపారు. గుంటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో కూడా కాంట్రాక్టు స్టాఫ్ నర్సు లు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.



విజయవాడ వరద బాధితులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు పంపిస్తున్న తహసీల్దారు

బాధితులను ఆదుకునేందుకు

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

మాచర్లటౌన్, సెప్టెంబరు 5: విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని తహసీల్దార్ ఎండి జియా ఉల్ హక్ అన్నారు. విజయవాడ వరద బాదితుల సహాయార్థం 5400 వాటర్ బాటిళ్లు, 4 వేల బిస్కెట్ ప్యాకెట్లు, ఇతర నిత్యావసర వస్తువులను సేకరించి గురువారం తహసీల్దార్ జియాఉల్‌హక్ ఆధ్వర్యాన ప్రత్యేక వాహనంలో కలెక్టరు కార్యాలయానికి పంపించారు. ఫ్యాన్సీ, కిరణా మర్చంట్, న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ జగదీశ్వరరెడ్డి, రామకృష్ణా సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి, ముత్యాల పాపిరెడ్డి, షేక్ ఖాసీం తదితరులు తమవంతుగా సాయమందించారని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ టీ. శ్రీనివాసరావు, ఆర్‌ఐ ఎన్ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్లు మస్తాన్‌వలి, రంగారావు, వీఆర్వోలు లాల్ సింగ్, నాగేశ్వరరావు, నరసింహారావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మోర్జంపాడు హైస్కూల్ హెచ్‌ఎంని సత్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

ఘనంగా గురుపూజోత్సవం

రెంటచింతల, సెప్టెంబరు 5: మండలం పరిధిలోని పలు విద్యాసంస్థలలో గురువారం గురుపూజోత్సవం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులను సత్కరించి గురుభక్తిని చాటారు.

అమరావతి: స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్లో రాధాకృష్ణ విగ్రహానికి ప్రధానోపాధ్యాయులు ఎం.రామాంజనేయులు, బోదనాసిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి చేసిన సేవలను కొనియాడారు.

మాచవరం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాచవరం జడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

మాచర్లటౌన్: పట్టణంలోని పెన్షనర్ అసోసియేషన్ హాలులో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు, పాపిరెడ్డి, గాలీబ్‌సాహెబ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఆదిత్య కళాశాలలో సెక్రటరీ, కరస్పాండెంట్ యనమదల వెంకట్రామయ్యను దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పెద్దారపు సీతయ్య, కొమెర లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ కుక్కమూడి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని కొత్తబోధనం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి, గురుపూజోత్సవం సందర్భంగా సర్వేపల్లి చిత్రపటానికి గుంటూరు మాజీమేయర్ కన్నా నాగరాజు పూలమాల వేసి ఘనంగా నివాలర్పించారు. అనంతరం విద్యార్థులకు ప్లేట్లు, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకరికల్లు: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

● పలు ప్రాంతాల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

మాచవరం, సెప్టెంబరు 5: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం నరసరావుపేట కేంద్రంగా నిర్వహించిన వేడుకల్లో పలువురు ఉత్తమ ఉపాధ్యా యులుగా ఎంపికై కలెక్టర్ అరుణ్ బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు,డీఈవోల చేతులమీదుగా సత్కారం, ప్రశంసా పత్రాలు అందుకున్నారు.మాచవరం మండలంలోని మోర్జంపాడు హైస్కూల్ హెచ్‌ఎం పద్మబాయి, కొత్త గణేషునిపాడు ఎంపీయూ పీఎస్ హెచ్‌ఎం ఎం. శ్రీధర్, పిల్లుట్ల మెయిన్ పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం మూర్తి, శ్రీరుక్మిణీపురంలో ఎంపీయూపీఎస్ సోషల్‌అసిస్టెంట్ సునీతలు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

మాచర్ల రూరల్ : మండంలోని కంభంపాడు జడ్పీ హైస్కూల్ పీఈటీ గొట్టిపాటి కర్తయ్య జిల్లా ఉత్తమ పీఈటీ ఎంపికయ్యారు.

కారంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం మద్దినేని వెంకట కోటయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే అరవిందబాబుల చేతుల మీదుగా సత్కారం పొంది, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

అచ్చంపేట: స్థానిక కస్తూర్బా బాలికల ఎస్‌వో దీప్తి, కొత్తపల్లి ఎస్సీ కాలనీ ఉపాధ్యాయుడు సిగిరిశెట్టి వేణుగోపాలరావు, చామర్రు ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు పీ దేవరాజు జిల్లా ఉత్తమ ఉపాధ్యా యులుగా ఎంపిక కాగా వీరిని కలెక్టర్ అరుణ్‌బాబు సన్మానించి మెమొంటో అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు వీరికి అభినందనలు తెలిపారు.

చవితి వేడుకలకు అనుమతులు తప్పనిసరి

మాచర్ల రూరల్, సెప్టెంబరు 5: వినాయక చవితి వేడుకల నేపథ్యంలో మండల పరిధిలో ఏర్పాటు చేయనున్న మండపాలకు సింగిల్ విండో పద్ధతిలో తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని మాచర్ల రూరల్ ఎస్‌ఐ నారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 7995095800 వాట్సాప్ నంబరుకు హాయ్ అని సందేశం పంపితే అనుమతులుకు సంబంధించిన ప్రక్రియ లింక్ వస్తుందన్నారు. వివరాలను పూర్తిచేసి మీసేవాలో చలానా రుసుం చెల్లించి అనుమతులు పొందాలన్నారు. సదరు దరఖాస్తు పోలీస్‌స్టేషన్‌కు రాగానే పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ శాఖల సిబ్బంది బృందంగా ఏర్పడి మండపం ప్రదేశాన్ని పరిశీలించి సానుకూలంగా ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారన్నారు. క్యూఆర్ కోడ్‌ను ల్యామినేషన్ చేసి ఉత్సవాలను నిర్వహించే మండపంలో తనిఖీలకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలన్నారు. విగ్రహం వద్ద రాజకీయ పరమైన పాటలు గానీ, ఫ్లెక్సీలు గానీ ఏర్పాటు చేయకూడదన్నారు. పోలీసులు సూచించిన మార్గంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా విగ్రహ నిమజ్జనం నిర్వహించుకోవాలన్నారు. అలాగే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌లో ప్రభుత్వంసూచించిన నియమ నిబంధనలు అనుసరించి అన్ని కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఎస్‌ఐ నారాయణ సూచించారు.

మాచవరం: వినాయక చవితి పందిళ్ళకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ సతీష్ సూచించారు.అనుమతులు లేకుండా పందిళ్ళు ఏర్పాటు చేస్తే పెనాల్టీలు, చర్యలు తప్పవని హెచ్చరించారు.

దాచేపల్లి: వినాయక చవితి వేడుకలు ప్రశాంత వాతావరణలో నిర్వహించుకోవాలని దాచేపల్లి సీఐ గుత్తి వెంకట్రావు తెలిపారు. గురువారం దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటి సభ్యులతో ఆయన సమావేశమై చవితి వేడుక నేపథ్యంలో వారికి నియమ, నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

● వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిపై అధికారులతో సమీక్ష

పిడుగురాళ్ల, సెప్టెంబరు 5: వరద బాధిత ప్రాంతాల్లో ప్రజలను, రైతులను అన్నివిధాలా ఆదుకుందామని, అధికారులు బాధితులకు చేరువగా ఉండి సహాయక చర్యలు అందించాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశించారు. నియోజకవర్గంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితిపై ఆయన గురువారం పిడుగురాళ్లలోని ఆర్‌అండ్‌బి బంగ్లాలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నియోజకవర్గంలో కృష్ణానది తీర ప్రాంతాలైన రామాపురం, పొందుగుల, కాట్రపాడు, భట్టుపాలెం గ్రామాల్లో పైర్లు దెబ్బతిన్నాయన్నారు. ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం అంచనాలను సిద్ధంచేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్‌శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని, ఆయా సమయాల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి బాధిత ప్రజలతో మమేకం కావాలని, సహాయక చర్యల్లో పాల్గొనాలని అన్నారు.

గత ఆదివారం నడికుడి రైల్వే స్టేషన్ మీదుగా దారి మళ్లించిన పలు రైళ్లలో ప్రయాణికులకు భోజనం, తాగునీరు, పండ్లు, మజ్జిగ పంపిణీ చేశామని, ఆ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని ప్రశంచించారు. కష్టకాలంలో అందరం కలిసి ఉందామని, వరద బాధితులకు, రైతులకు భరోసా నిద్దామని అధికారులకు సూచించారు. సీఎం చంద్రబాబునాయుడు గత మూడు రోజులుగా విజయవాడలో ఉండి క్షేత్రస్థాయిలో సహాయక చర్యల్లో పాల్గొన్నారన్నారు. సమావేశంలో గురజాల ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెంకటసుబ్బారావు, పాండురంగా శ్రీను, వడవల్లి సర్వేశ్వరరావు, సయ్యద్ అమీర్ అలీ, తహసీల్దార్లు మధుబాబు, క్షమారాణి, కుటుంబరావు, నగేష్, ఆర్‌అండ్‌బి ఏఈ యూసఫ్, వ్యవసాయ శాఖ ఏడీఏ కృష్ణదేవరాయలు, సీఐలు ఎస్ వెంకట్రావు, గుత్తి వెంకట్రావు, భాస్కరరావు, పార్టీ నేతలు పలువురు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ప్రజావేదిక

● సామాజిక తనిఖీల్లో రూ. 15 లక్షల అవినీతి

దుర్గి, సెప్టెంబరు 5: ప్రజల సమక్షంలో జరగాల్సిన ప్రజావేదిక కార్యక్రమాన్ని అధికారులు తూతూ మంత్రంగా నిర్వహించారు. గురువారం ఉదయం 10 గంటలకు జరగాల్సిన ఈ సభ డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఆలస్యంగా రావడంతో మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభించారు. వారం రోజులుగా మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో భాగంగా 299 పనులకు గాను రూ. 6,36,63,172ల విలువైన పనులకు సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ పనులలో ఉపాధి పనుల్లో రూ.3,37,096 అవినీతికి పాల్పడగా రూ.7,34,576 రికవరీ చేయాలని తీర్మానించారు. మొక్కలు నాటడంలో రూ. 2,09,618 అవినీతి జరగగా కూలీ పనులు చేయకుండానే కూలీలకు రూ.2,31,000 డ్రా చేసినట్లు నిర్ధారించారు. ఇదిలా ఉంటే ప్రతి గ్రామంలో తనిఖీలు తూతూ మంత్రంగా జరిగాయని, ఎవరికీ తెలియకుండానే మమ అనిపించారని ప్రజలు వాపోతున్నారు. మరళా వాటిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అవినీతిని బయటకు తీయాలని ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీతా సాయిశంకర్, డీఈవో విజయలక్ష్మి, డీఆర్‌డీఏ ఏపీవో భరత్ కుమార్, ఎంపీడీవో గుప్త, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఎస్‌ఆర్‌పీ రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు



దాచేపల్లిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న గణపతి విగ్రహాలు

అమ్మకానికి సిద్ధంగా గణపతి విగ్రహాలు

దాచేపల్లి, సెప్టెంబరు 5: వినాయక చవితి వేడుకలకు గణపతి ముస్తాబు చేశారు. దాచేపల్లిలో రాజస్థాన్‌కు చెందిన కళాకారులు విగ్రహాలను తయారు చేశారు. అడుగు విగ్రహం నుంచి 15 అడుగుల వరకు విగ్రహాలు తయారు చేశారు. విగ్రహాల ధర రూ.500 నుంచి రూ. 27 వేల వరకు పలుకుతోంది. గత ఏడాది కన్నా ఈ ఏడాది ధరలు 20 శాతం పెరిగినట్లు కొనుగోలు దారులు చెబుతున్నారు.

క్రోసూరు ఎస్‌ఐగా నాగేందరరావు

క్రోసూరు, సెప్టెంబరు 5:క్రోసూరు పోలీసుస్టేషన్ నూతన ఎస్‌ఐగా కే.నాగేందరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నకరికల్లు నుంచి ఇక్కడకు బదిలీ పై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన మహమ్మద్ షఫీ నాగార్జున సాగర్‌కు బదిలీ పై వెళ్ళారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నాగేంద్రరరావు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. చట్టాన్ని అతిక్రమించే అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. అనంతరం పలు రాజకీయ పార్టీల నేతలు, వ్యాపారవర్గాలవారు ఎస్‌ఐ నాగేందరరావును మర్యాద పూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలియ జేశారు.

మహిళా పోలీసులకు నిఘా బాధ్యత

గ్రామాల్లో నెలకొల్పే వినాయక విగ్రహాల వద్ద ఉత్సవాల నిర్వాహణపై నిఘా బాధ్యతను మహిళా పోలీసులకు అప్పగిస్తున్నట్టు క్రోసూరు ఎస్‌ఐ కే.నాగేంద్రరరావు తెలిపారు. గురువారం క్రోసూరు పోలీసుస్టేషన్‌లో 15 గ్రామ సచివాలయాల పరిధిలోని మహిళా పోలీసులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల నిర్వాహణను నిబంధనలకు లోబడి జరిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విగ్రహం మండపం ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి పొందాలని, ప్రతి మండపం వద్ద నిఘా కెమేరాలు ఏర్పాటు చేయాలని, మహిళా పోలీసులకు సూచించారు. గ్రామాల్లో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారి పై గట్టి నిఘా ఉంచాలని, మహిళా రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో ఎటువంటి రాజీ పడవద్దని వారికి సూచించారు.

గ్రామాల్లో 'పీఎం జన్‌మన్'

మాచర్ల రూరల్, సెప్టెంబరు 5: మండలంలోని బోధనంపాడు, పెద అనుపు, బెల్లంకొండవారిపాలెం, చెంచుకాలనీలలో గురువారం పీఎం జన్‌మన్ కార్యక్రమం నిర్వహించారు. చెంచులకు 9 ప్రభుత్వ శాఖల ద్వారా లభించే పథకాలు, ప్రయోజనాలను అధికారులు వివరించారు. కార్యక్రమాల్లో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సీవీ ధనంజయ్, ఎంపీడీవో సరోజినిదేవి, విస్తరణాధికారి కోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ బాబునాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెల్లంకొండ ఎస్‌ఐగా రాజా

బెల్లంకొండ, సెప్టెంబరు 5 : బెల్లంకొండ నూతన ఎస్‌ఐగా బీ.రాజా గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో నెల్లూరు జిల్లాలో పనిచేస్తూ బదిలీపై బెల్లంకొండ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాజేష్ మెరైన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజాకు పోలీసు స్టేషన్ సిబ్బంది, రాజకీయ నేతలు పలువురు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 5: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం నాటికి 587.70 అడుగులు ఉంది. ఇది 305.92 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8529 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,557 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్‌ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం అవుట్ ఫ్లో వాటర్‌గా 40,486 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 40,486 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

0.4078 ఎంయూ విద్యుత్ తయారీ

రెంటచింతల,సెప్టెంబరు 5 : సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.4078 ఎంయూల విద్యుత్ తయారైందని ఎస్‌ఈ వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పులిచింతలకు 2 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 19888,టేల్ రేస్ ఛానల్ ద్వారా 8570 మొత్తం 28458 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సాగర్ నుంచి 29 వేల క్యూసెక్కుల చేరుతుందని ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.48 మీటర్ల నీటి మట్టం ఉండగా, అది 7.066 టీఎంసీలకు సమానమని తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 5 : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువనుంచి 30,401 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతుందని తెలిపారు. ప్రాజెక్టు వద్ద 57,456 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. పవర్ జనరేషన్ ద్వారా 16 వేల క్యూసెకులు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

దుర్గి, సెప్టెంబరు 5: మండల కేంద్రమైన దుర్గిలోని ఉర్దు స్కూల్లో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీ గాయత్రి, ఏఎన్‌ఎం శివమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ ఎస్‌ఐగా సోమేశ్వరరావు

ముప్పాళ్ళ, సెప్టెంబరు 5: ముప్పాళ్ళ ఎస్‌ఐగా ఉయ్యూరు సోమేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన ప్రత్తిపాడు మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ముప్పాళ్ళ వచ్చారు. ముప్పాళ్ళ ఎస్‌ఐ హజరత్తయ్య బదిలీపై బీఎస్‌బీకి వెళ్ళారు.



అమరావతిలో పంటనష్టాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పంట నష్టం నమోదు

అమరావతి, సెప్టెంబరు 5: వరద ముంపు వలన దెబ్బతిన్న పంటల నష్టాన్ని మండల వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది గురువారం నుంచి నమోదు చేస్తున్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు మండల పరిధిలోని అమరావతి, పెదమద్దూరు, వైకుంఠపురం గ్రామాలలో ఏడీఏ వీ.హనుమంతరావు, ఏవో అహ్మద్ సిబ్బంది లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పంట నష్టం నమోదులో ఎలాంటి తేడాలు లేకుండా దెబ్బతిన్న పంటలను, రైతుల వివరాలను నమోదు చేస్తున్నట్లు ఏడీఏ హనుమంతరావు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం

పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి

బెల్లంకొండ, సెప్టెంబరు 5 : ప్రకృతి వ్యవసాయంతో రైతులకు నిరంతరం ఆదాయం లభిస్తుందని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి తెలిపారు. గురువారం బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న మహిళా రైతు వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యవసాయ క్షేత్రంలో మొత్తం 27 రకాల కూరగాయలు, ఆకు కూరలు, దుంప జాతి, తీగ జాతి, పూలు, వివిధ రకాల పంటలను ఒకే పొలంలో నాటితే నిరంతరంగా 365 రోజులు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. అలాగే ఈ విధానంతో జీవవైవిధ్యం బాగా పెరిగి అధిక దిగుబడులు లభిస్తాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఘన జీవామృతం, కషాయాలు వాడటం వలన అతి తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడి, ఆదాయం పొందవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి ప్రతి రైతు వ్యవసాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీ అంజలి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పొలాన్ని పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి



విజయవాడ 15వ డివిజన్‌లో పర్యటించిన కన్నా లక్ష్మీనారాయణ

సహాయక చర్యల్లో ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, సెప్టెంబరు 5 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మూడవ రోజు గురువారం కూడా విజయవాడలోని 15వ డివిజన్ వరద బాధితులను పరామర్శించారు. డివిజన్‌లో నీరునిలిచి ఉన్నందున వరదనీటిని మోటారుసాయంతో దగ్గరుండి తోడించారు. కాలువల్లో మురుగు, రోడ్లపై చెత్త తొలగించాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. బ్లీచింగ్ చల్లాలని, ఫాగింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. 15వ డివిజన్‌లో వార్డు సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పర్యవేక్షించారు. శుక్రవారం నుంచి 15వ డివిజన్‌లో నిత్యవసర వస్తువులు పంపిణీ చేయనున్నట్టు కన్నా తెలిపారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు విజయవాడలోని సింగ్ నగర్ కాలనీ, ముంబై కాలనీ, వైఎస్‌ఆర్ కాలనీలో సత్తెనపల్లి టీడీపీ నేతలు బాధితులకు అండగా నిలిచారు. గురువారం మన్నెం శివనాగమల్లేశ్వరరావు పునరావాస కేంద్రాలకు వెళ్లి ఐదు వేల వాటర్ బాటిల్స్, వెయ్యి పాలప్యాకెట్లు, వెయ్యి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.



విజయవాడకు ఆహార పదార్థాలు, తాగునీరు పంపిస్తున్న న్యాయవాదులు

వరద బాధితులకు న్యాయవాదుల సాయం

సత్తెనపల్లి, సెప్టెంబరు 5 : విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయంగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆహారం, తాగు నీటిని న్యాయమూర్తులు సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, తౌషిత్ హుస్సేన్, పీ.ప్రియదర్శిని ద్వారా ఆర్డీవోకు అందించగా, అక్కడ నుంచి విజయవాడ పంపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చక్రవర్తి, న్యాయవాదులు జీ. మార్క్‌రావు, పూజల వెంకటకోటయ్య, సైదా, వీరయ్య, సంగీతరావు, ఏసురత్నం, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ : వరద బాధితుల సహాయార్థం సత్తెనపల్లి పట్టణంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు విరాళాలు సేకరించారు. విరాళాలను వరద బాధితులకు అందిస్తామని సీపీఎం నాయకులు తెలిపారు.

ఆర్యవైశ్యుల విరాళం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆర్యవైశ్య సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికి తిరిగి రూ 36,560 విరాళాలు సేకరించినట్టు ఆర్యవైశ్య నేతలు తెలిపారు. ఈ విరాళాన్ని ఎమ్మెల్యే కన్నా చేతుల మీదుగా వరద బాధితులకు పంపిస్తామని వారు తెలిపారు.

సంచార-విముక్తి జాతులను ఆదుకోవాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 5: పలు వెనుకబడిన తరగతుల్లో అట్టడుగునవున్న సంచార-విముక్తి జాతుల వారు 42 కులాలుగా బీసీ-ఏ గ్రూపులో ఉన్నారని, వారందరినీ ఆదుకోవాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో బీసీ-ఏ గ్రూపు కుల సంఘ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు మారినా బీసీల సమగ్రాభివృద్ధికి మంచి పథకాల రూపకల్పనకు ముందుకు రాలేదన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జాతీయ వెనుకబడిన తరగతుల జాతీయ సంస్థల ద్వారా వివిధ రాష్ట్రాల్లోని బీసీ-ఏ కులాల వారిని 10 నుంచి 20 మంది సభ్యులు గ్రూపులుగా ఏర్పడితే ఒక్కో గ్రూపునకు ముందుగా రూ.10వేలు ఉచితంగా ఇవ్వడంతో పాటు రూ. 25 వేల నుంచి రూ. లక్ష వరకు రుణసదుపాయం కల్పిస్తుందన్నారు. రూ. 10 వేలు ఖర్చు చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించడంతో పాటు కేంద్ర బీసీ ఆర్థిక సంస్థ బ్యాంకుల ద్వారా ఇప్పిస్తున్న రుణంలో 50 శాతం సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వ భరిస్తుందన్నారు. సమావేశంలో క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, బాదుగుండల శ్రీను, వై. మురళి, ఉప్పన వెంకటేశ్వర్లు, ఎడవల్లి కొండలు, చిలకాశేఖర్, కాసింసైదా, శ్రీకాంత్, ప్రసాద్, నాగ పాల్గొన్నారు.

పశు బీమా నమోదులో ప్రథమ స్థానం

రాజుపాలెం, సెప్టెంబరు 5: పశు బీమా నమోదులో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లాను ప్రథమస్థానంలో నిలిపినట్లు పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ కె కాంతారావు తెలిపారు. గురువారం రాజుపాలెం గ్రామంలోని ఏడీఏ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంతారావు మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో పశువులకు వచ్చే గొంతువాపు చిటుకు జబ్బులకు చికిత్స చేసేందుకు జిల్లాలో 28 బృందాలు పని చేస్తున్నాయన్నారు. గొర్రెలకు చీడ, పీడ టీకాలు వేసేందుకు జిల్లాకు 5,63200 డోసులు ఇన్‌జక్షన్‌లు వచ్చిన్నట్లు వెల్లండించారు. గాలికుంటుకు 4 లక్షల 36 వేల టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా ఈనెల 10లోపు ఈ టీకాలను వేసేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాకు మొత్తం 700 గోకులాలు వచ్చాయని తెలిపారు. సమావేశంలో ఏడీఏ జీ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంధంగా రహదారికి మరమ్మతులు

అమరావతి, సెప్టెంబరు 5: మండల పరిధిలోని పెదమద్దూరు గ్రామంలో వరద తాకిడికి దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేసేందుకు స్థానిక టీడీపీ నేతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. అమరావతి నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో పెదమద్దూరు వాగుపై ఉన్న చప్టాతో పాటు రహదారి ఇటీవల వరదలకు కోతలకు గురై గుంతలమయమైంది. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పిలుపు మేరకు స్థానిక టీడీపీ నేతలు పొదిలె శ్రీనివాస్ ఆధ్వర్యంలో రహదారికి మరమ్మతులు చేపట్టారు.

నేత్రదానంతో మరో జీవితం

పెదకూరపాడు, సెప్టెంబరు 5 : ఒకరు నేత్రదానం చేయటం ద్వారా మరో మారు జీవించే అవకాశం పొందవచ్చని 75 తాళ్ళూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వీర్నాల ఆదిత్య అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరు పీహెచ్‌సీలో నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని జన చైతన్య సమితి ముద్రించిన కరపత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. వేలాది మంది కంటి చూపు లేక చీకటిలో ఉండి పోతున్నారని, మరణానంతరం నేత్రదానం చేయవచ్చున్నారు. కార్యక్రమంలో జనచైతన్యసమితి కార్యదర్శి తుళ్ళూరి సాంబశివరావు, కో-ఆర్డినేటర్ వెలితోటి అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

పెదకూరపాడు, సెప్టెంబరు 5 : వివాహిత అదృశ్యం అయిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాణావత్ బాలూనాయక్ గురువారం ఒక ప్రటకనలో పేర్కొన్నారు. మండలంలోని పొడపాడు గ్రామానికి చెందిన కాసరబాధ శివకుమారి(55) ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని భర్త సాంబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

జీవామృతంతో అధిక ప్రయోజనం

క్రోసూరు, సెప్టెంబరు 5 : ప్రకృతి వ్యవసాయంలో జీవామృతాలతో పత్తి పంటకు అధిక ప్రయోజనం చేకూరుతుందని జిల్లా నాచురల్ ఫామింగ్ అసోసియేట్ టీ.సైదయ్య అన్నారు. గురువారం దొడ్లేరులో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగువుతున్న పత్తి పొలాలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో పత్తి పొలంలో నిలిచి ఉన్న నీటిని తొలగించి వంద కిలోల ఘన జీవామృతం, 50 కిలోల వేప పిండి కలిపిన మిశ్రమాన్ని మొక్కల మొదళ్ళ వద్ద వేయాలన్నారు. దీనివలన అన్ని పోషకాలు అందుబాటులోకి రావటమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తరువాత 150 లీటర్ల నీటికి 30 లీటర్ల ద్రవ జీవామృతాన్ని కలిపి మొక్క పూర్తిగా తడిచే విధంగా పిచికారి చేయాలని, మూడు రోజుల వ్యవధిలో వంద లీటర్ల నీటికి 250 మిల్లీ మీటర్ల కోడి గుడ్డు, నిమ్మరసం ద్రావణం, చేప బెల్ల ద్రావణం కలిపి పిచికారి చేయాలని, దీని వల్ల సూక్ష్మ పోషకాలు అందుబాటులోకి వచ్చి పూత రాలటం తగ్గుతుందని చెప్పారు. సందర్భంగా డ్వాక్రా మహిళల ద్వారా ఘన జీవామృతం, ద్రవజీవామృతాలను తయారుచేయించారు. కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయదారులు, అరుణ, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.



విజయవాడలో తాగునీటిని సరఫరా చేస్తున్న శివశక్తి ఫౌండేషన్ ట్యాంకర్

వరద బాధితులకు తాగునీటి సరఫరా

వినుకొండ, సెప్టెంబరు 5: విజయవాడలో వరద ముంపు బాధితులకు అండగా శివశక్తి ఫౌండేషన్ నిలిచింది. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచనలతో ఆయన సతీమణి శివశక్తి లీలాఅండ్అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు గురువారం ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు. బాధితులకు అవసరమైనన్ని రోజులు తాగునీరు సరఫరా చేస్తామని లీలావతి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్.. ఒకరికి రూ.10 వేల జరిమానా

చిలకలూరిపేట, సెప్టెంబరు5: చిలకలూరిపేట రూరల్ పోలీసులు జాతీయ రహదారిపై బొప్పూడి జంక్షన్ వద్ద గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనం నడుపుతున్న బాపట్ల జిల్లా రామకూరు గ్రామానికి చెందిన బి ఏలేసు అనే వ్యక్తిని అదుపులో తీసుకున్నారు. అతడిని చిలకలూరిపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రూ.10వేల జరిమానా విధించారు.

చిలకలూరిపేటలో ఎస్పీ పర్యటన

చిలకలూరిపేట, సెప్టెంబరు 5: పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురువారం రాత్రి చిలకలూరిపేట పట్టణంలో పర్యటించారు. ప్రధానంగా ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్న నరసరావుపేట సెంటర్, పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్, కళామందిర్ సెంటర్‌లను ఆయన సందర్శించి అక్కడ ట్రాఫిక్ విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం వినాయకుడి విగ్రహాలు నిమజ్జనం చేసే పలు ప్రదేశాలను ఆయన సందర్శించారు. ఒంగోలు, చీరాల రోడ్డులో బ్రిడ్జిల వద్ద ఉన్న ఓగేరు వాగులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌బీ సీఐ బి సురేష్ బాబు, అర్బన్ సీఐ పి.రమేష్ బాబు, అర్బన్ ఎస్ఐలు చెన్నకేశవులు, రహంతుల్లా పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల నిర్వహణకు సహకరించాలి: ఎస్పీ

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 5: జిల్లాలో శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు సహకరించాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని, నిమజ్జనం జరిగే ప్రదేశంలో సీసీ కెమెరాలు, క్రేన్లు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో వినాయక చతుర్థి జరుపుకునేలా వినాయక మండప కమిటీ నిర్వహణ సభ్యులతో ప్రతి పోలీస్ స్టేషన్ అధికారి సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడడం జరిగిందన్నారు. ముందుగా మండపాన్ని ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా ఉండే ప్రదేశాలలో ఏర్పాటు చేసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. గతంలో వినాయక ఉత్సవాలలో అల్లర్లు సృష్టించిన వారిపై కేసులు ఉన్నా వారిపై ముందుగా బైండోవర్ చేయాలని ఎస్పీ సూచించారు. ప్రతి నిమజ్జనం చేసే ప్రదేశం వద్ద కనీసం 5 లేదా 6 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, క్రేన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

పోలీసు అనుమతులు తప్పనిసరి

వినుకొండ, సెప్టెంబరు 5: వినాయక చవితిని పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ, నియోజకవర్గ ప్రజలంతా వినాయక విగ్రహాల ఏర్పాటులో పోలీసుల నుంచి అనుమతులు తీసుకోవాలని పట్టణ సీఐ శోబన్‌బాబు, రూరల్ సీఐ ప్రభాకర్‌రావులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతులు తీసుకున్నాకే మండపాలు ఏర్పాటు చేయాలని, అనుమతులు లేకుండా విగ్రహాలు పెట్టరాదని, విగ్రహాల నిమజ్జన ప్రదేశం, వెళ్ళే మార్గం, విగ్రహాల ఎత్తును పోలీసులకు తెలియజేయాలన్నారు. వివాదాలు లేకుండా ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని, అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

చవితి పందిళ్ళ నిర్వాహకులతో పోలీసుల సమావేశం

చిలకలూరిపేట, సెప్టెంబరు 5: వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక పందిళ్ళ నిర్వాహక కమిటీ సభ్యులతో చిలకలూరిపేట టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. మండపాల వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి, పాటించవలసిన నియమ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. చిలకలూరిపేట పట్టణ సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ లు చెన్నకేశవులు, రహంతుల్లా పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు పై విరిగిపడిన చెట్టు కొమ్మలు

నూజెండ్ల, సెప్టెంబరు 5: భారీ వర్షం...ఈదురు గాలులకు మండలంలోని ఐనవోలు సమీపంలో గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు, ఆటోలపై చెట్ల కొమ్మలు పడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వినుకొండ నుంచి పొదిలి వెళ్తున్న ఆర్టీసీ బస్సుపై చెట్ల కొమ్మలు పడటంతో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఎస్ఐ బీవీ కృష్ణారావు స్థానిక నాయకుల సహకారంతో జేసీబీని తెప్పించి చెట్ల తొలగింపు చేపట్టారు. ఐనవోలు సమీపంలో రోడ్డుపై ఉన్న గోతుల్లో వర్షపు నీరు నిలబడటంతో ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురై పలువురు గాయపడ్డారు.

సచివాలయంలో తనిఖీ

బొల్లాపల్లి, సెప్టెంబరు 5: మండలంలోని వెల్లటూరు సచివాలయాన్ని గురువారం డీఎల్‌డీవో ఎం.వెంకటరెడ్డి తనిఖీచేశారు. సచివాలయ రికార్డులను, పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం అందుతున్న సేవలగురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీహరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్లలో పౌష్టికాహార మాసోత్సవాలు

రొంపిచర్ల, సెప్టెంబరు 5: మండలంలోని రొంపిచర్లలో పౌష్టికాహార మహోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శశిదేవి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆషా వర్కర్లు, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పాడిరైతుల ఆర్థికాభివృద్ధికి సంగం డెయిరీ తోడ్పాటు

● డైరెక్టర్ ఆంజనేయులు



కనమర్లపూడిలో బోనస్ పంపిణీ చేస్తున్న డైరెక్టర్ ఆంజనేయులు

కనమర్లపూడి (శావల్యాపురం) సెప్టెంబరు 5: పాడి రైతులకు వివిధ రకాల రాయితీలు, బోనసులను అందజేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి సంగం డెయిరీ తోడ్పాటు అందిస్తుందని వినుకొండ సంగం డెయిరీ డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు అన్నారు. మండలంలోని కనమర్లపూడి గ్రామంలోని రెండు సంగం డెయిరీ సెంటర్లలో బోనస్‌ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రెండు సెంటర్లలోని 80మంది పాల ఉత్పత్తిదారులకు రూ.4.15లక్షలను బోనస్‌లుగా పంపిణీ చేశారు. వారిలో అత్యధికంగా బోడెపూడి లింగారావు రూ.16,050, బోడెపూడి చినరామకోటేశ్వరరావు రూ.16,000లను బోనస్‌లుగా పొందారు. కార్యక్రమంలో సెంటర్ల అధ్యక్షుడు అల్లు వెంకటరాకేష్, మర్రి రాములు, సూపర్‌వైజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండలంలోని కంభంపాడులో సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారులకు గురువారం బోనస్ పంపిణీ చేశారు. గ్రామంలో 60 పాల ఉత్పత్తిదారులకు వంద రూపాయలకు రూ.8చొప్పున నాలుగు లక్షల రూపాయలు బోనస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగం డెయిరీ అధ్యక్షుడు గంగినేని హనుమంతరావు, వేతన కార్యదర్శి ఎండ్లూరి సుబ్బారావు, సూపర్‌వైజర్లు రామకోటయ్య, ప్రసాదు, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలను అందజేస్తున్న బ్రాహ్మణ సేవాసమితి సభ్యులు

వినుకొండ, సెప్టెంబరు 5: వినుకొండ బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం ఐదు పేద బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసర సరుకులు, వస్త్రాలను అందజేశారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన చిదంబరశర్మ, సుబ్బయ్యశర్మ, మల్లికార్జునశర్మలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసమితి వ్యవస్థాపకులు జీవీ మాధవరావు, దాతలు రాఘవేంద్రరావు, మౌనిక, మురళీధర్, కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం

● డ్రెయిన్లలో పేరుకుపోతున్న మురుగు
● విజృంభిస్తున్న దోమలు
● పెరిగిన జ్వరపీడితులు



కొచ్చెర్లలో రోడ్డుపై నిలిచిన మురుగు, డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తా చెదారం

ఈపూరు, సెప్టెంబరు 5: అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ.. రోడ్లపైనే మురుగునీటి కుంటలు.. రోజురోజుకు విజృంభిస్తున్న దోమలు.. రోగాల బారిన ప్రజలు.. ఇదీ ఈపూరు మండలంలోని దుస్థితి. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. మురుగు కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో నీరంతా రోడ్లపైకి చేరి అక్కడ కొద్దిపాటి తటాకంలా ఉంది. మురుగునీరు నిల్వ ఉన్న చోట దోమలు ఉధృతి ఎక్కువగా ఉంది. శివారు గ్రామాల్లో, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సిమెంట్ రోడ్లు నిర్మించారు కాని డ్రెయిన్లు ఏర్పాటుచేయలేదు. దాంతో కొద్దిపాటి వర్షం పడినా నీరంతా గృహాల్లోకి చేరుతోంది. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికశాతం జ్వరాలతో బాధపడుతున్నారు. రోజువారీగా వందల సంఖ్యలో ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరికొందరు గ్రామాల్లో ఆర్ఎంపీల వద్ద, పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. కొచ్చెర్ల, ఉప్పరపాలెం, అంగలూరు, వనికుంట గ్రామాల్లో రోడ్లపైనే మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొచ్చెర్లలో ప్రధాన వీధులన్నీ అధ్వానంగా ఉన్నాయి. అధికారులు, పాలకులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను బాగుచేయాలని, దీంతో పారిశుధ్యం బాగుపడుతుందని ప్రజలు కోరుతున్నారు.



ఈపూరు ఆసుపత్రిలో చికిత్స పొందున్న జ్వరపీడితులు

తల్లిదండ్రులు జన్మనిస్తే.. జీవితాన్ని ఇచ్చేది గురువులు

● ఉపాధ్యాయ దినోత్సవంలో ఎమ్మెల్యేలు చదలవాడ, ప్రత్తిపాటి



చిలకలూరి పేట శారద హైస్కూల్ లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు పత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవింద బాబు

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 5: తల్లిదండ్రులు జన్మనిస్తే జీవితాన్ని ఇచ్చేది గురువులు అని, అందుకే వారిని దైవంగా భావించే సంస్కృతి మనది అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో గురు పూజోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థి తడికళ్ళ మోహనరావు సొంత నిధులతో నిర్మించిన హరినాథబాబు కళా వేదికను ప్రత్తిపాటి, చదలవాడలు ప్రారంభించారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్లు ఎమ్మెల్యేకు గౌరవ వందనం సమర్పించారు. పాఠశాలలో పరిస్థితులు, విద్యా వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వేసే ప్రతి అడుగు శిష్యుల ఉన్నతిని కోరుకునే ఈ వృత్తిని మించిన సంతృప్తి కూడా మరెక్కడా లభించదని ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులకు ప్రత్యేకమైన గుర్తింపు తీసుకువచ్చిన మహనీయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని, ఆ సేవలకు గుర్తింపుగానే ఆయన జయంతిని దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశ ప్రథమ పౌరుడిగా రావటం కూడా గర్వించదగ్గ విషయం అన్నారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి వచ్చిన వారిలో అనేకమంది ఉన్నత పదవుల్లో ఉన్నారని, ఈ దేశ అత్యున్నత స్థానానికి ఎదిగిన ఉపాధ్యాయులు చాలా మంది ఉన్నారని, చిలకలూరిపేట అర్బన్ సీఐ కూడా ఉపాధ్యాయ వృత్తిని నుంచి వచ్చారన్నారు. ఆ గురువులు ఇచ్చే విద్యా బోధనలే విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని, గురువులను ప్రతి ఒక్కరు ఆరాధించాలని, పూజించాలని ప్రత్తిపాటి సూచించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

శావల్యాపురం, సెప్టెంబరు 5: ఉపాధ్యాయ దినోత్సన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద పూర్వవిద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో వేల్పూరు జడ్పీపాఠశాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, గ్రామపెద్దలు కలసి ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. గతేడాది ట్రిపుల్ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. దామకొండయ్య జ్ఞాపకార్థం కుమారుడు నరేంద్ర క్రీడా దినోత్సవం రోజున క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ అందజేసి అభినందించారు. ఎస్ఎంసీ చైర్మన్ దన్నవరపు శ్రీనివాసరావు, హెచ్ఎం మహబూబ్ సుభానీ, పెద్దలు సంద్రపాటి చలపతిరావు, పల్లపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శావల్యాపురంలోని శ్రీరామపబ్లిక్ స్కూల్లో ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, డైరెక్టర్ అజిత్‌చంద్ పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని లయోలా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రెవ.ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు జ్ఞాన సుందర రావు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ మార్నేని బాలసౌరయ్య, నిలిమా దంపతులు విద్యార్థులకు నూతనవస్త్రాలను బహూకరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకొన్నాయి.

● నాదెండ్ల: మండలంలోని గణపవరం కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా సైన్స్ ఉపాధ్యాయుడు కే రత్నరాజు, ఆంగ్ల ఉపాధ్యాయురాలు నాగశైలజ రాణిలు ఎంపికయ్యారు.



విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

వీరికి నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబులు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. వీరిని హెచ్ఎం ఐ కృష్ణానాయక్ తదితరులు అభినందించారు.

● నూజెండ్ల: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన కే బాలకృష్ణరావును ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు.

● ఈపూరు: గురుపూజోత్సవ కార్యక్రమాన్ని మండలంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈపూరు శాఖాగ్రంథాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పూజారి జగన్మోహిని, గ్రంథాలయుద్యోగి శ్రీనివాసరావు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో గురు పూజోత్సవ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులను గురువులను సన్మానించారు. రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో ఎంఈవో బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి మినీ కళ్యాణమండపంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో టీచర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులకు గౌరవ పురస్కారం నలుగురు పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున రూ.40 వేలు ఆర్థికసాయం చేశారు. సెల్ఫ్ స్టడీ లోన్ కింద ఒకరికి రూ.20 వేలు, శ్రేయోభిలాషి ఫండ్ నిమిత్తం రూ.20 వేలు అందజేశారు. 30 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ గవర్నర్ కొలిశెట్టి శివ సుబ్రహ్మణ్యం, సెక్రటరీ తవ్వ నాగమల్లేశ్వరరావు, వాసవి క్లబ్ గ్రేటర్ ప్రెసిడెంట్ కనమర్లపూడి హరికృష్ణ, సెక్రటరీ తాడి పత్రి మల్లికార్జున గుప్తా, కోటా సత్యం, మునగాల చిరంజీవి, రీజనల్ చైర్మన్ కోటేశ్వరరావు, కే సుజాతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



వేల్పూరులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు

● స్థానిక ఎంఏఎం గ్రూప్ కళాశాలలో విద్యార్థులు ఆటపాటలు నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, పార్మసీ, లా కాలేజ్, ఫిజియోథెరపీ, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు సంపత్‌బాబు ఎంపిక

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 5: స్కోప్ ఫౌండేషన్ ఆచార్య దేవోభవ జాతీయ అవార్డుకు యడ్లపాడు మండలం ఉపాధ్యాయుడు బెజ్జం సంపత్‌బాబును ఎంపిక చేసినట్లు స్కోప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కొండలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● చిలకలూరిపేట: చౌదరయ్య స్కూలులో జరిగిన కార్యక్రమంలో నవోదయ విద్యాలయం విశ్రాంత ఉపాధ్యాయుడు పిన్నక సాంబశివరావును ఘనంగా సత్కరించారు. మిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పండరిపురంలో ఉన్న జడ్పీ హైస్కూల్ హెచ్ఎం జి రమణరావును ఘనంగా సత్కరించారు. అనంతరం బ్రిలియంట్ విద్యాసంస్థలో మద్దిరాల శ్రీనివాసరావును సత్కరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సొలస, ఎడ్లపాడు, మురికిపూడి, పసుమర్రు హైస్కూళ్ళలోని పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు.

● నరసరావుపేట టౌన్: ఎంఆర్‌రెడ్డి విద్యా సంస్థలలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఆట్లూరి శాంతిశ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ పీ భార్గవ్ భూషణ్‌రావు, కే కృష్ణారెడ్డి, అధ్యాకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పట్టణంలోని కే-రిడ్జి ఇంటర్ నేషనల్ స్కూల్‌లో స్కూల్ డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, నాతాని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ బర్నబాస్, ఇన్‌చార్జి కోట బాపూజీ, అకాడమిక్ కోఆర్డినేటర్ హేమంత్, హేమ పాల్గొన్నారు.

● కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాలలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్స్ కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, సుదా సురేష్ బాబు, పి.కృష్ణరావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గేదెల దొంగల ముఠా

శావల్యాపురం, సెప్టెంబరు 5: రాత్రివేళల్లో గ్రామాల్లో సంచరిస్తూ విలువైన గేదెలను దొంగిలిస్తున్న ముఠాను గ్రామస్థులు ఎట్టకేలకు పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన మండలంలోని శానంపూడిలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని శానంపూడి గ్రామానికి చెందిన ఆవుల వెంకటసుబ్బయ్య, ఆవుల పద్మలు బుధవారం సాయంత్రం తమ గేదెలను ఇంటి పక్కనే ఉన్న పశువుల పాకలో కట్టివేశారు. బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పశువుల పాకలోకి ప్రవేశించి గేదెలను తీసుకొని వెళుతుండగా కుటుంబ సభ్యులు గమనించి కేకలు వేయటంతో దొంగలు అక్కడినుండి పరారయ్యారు. అనంతరం గ్రామస్థుల సహకారంతో వెతికి ఒక పురుషుడు, మహిళను పట్టుకున్నారు. అందులో ఒకరు పరారయ్యారు. అనంతరం వారిని శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

వైద్య శిబిరం

నూజెండ్ల, సెప్టెంబరు 5: మండలంలోని రాముడుపాలెం గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల కాలంలో జ్వరాలు వ్యాప్తి చెందుతున్న దృష్ట్యా గ్రామంలో పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సురక్షితమైన నీటిని సేవించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో తిరుపతమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

బొల్లాపల్లి, సెప్టెంబరు 5: మండలంలోని వెల్లటూరులోని ఎస్సీ కాలనీకి చెందిన మేడేపల్లి సుధాకర్‌కు రక్తప్రసరణ కాక గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్ళగా నెల రోజుల తరువాత మోకాళ్ల రెండు తీసి వేయటంతో విషయం తెలుసుకున్న అరుంధతి సేవా సంఘం అధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించారు. సేవాసంఘం తరుపున 50కేజీల బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ కట్టెపూడి భర్త, శిఖా రామయ్య, గుంజర పున్నయ్య, శిఖా కోటేశ్వరరావు, ధూపాటి బాబు, నరసయ్య ఇస్సాక్, రాజేష్, దావీదు, సింహాద్రి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



అరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో సాయం చేస్తున్న దాసరి కోటేశ్వరరావు తదితరులు

సుబ్బయ్యపాలెం వద్ద రేషన్ బియ్యం పట్టివేత

● పెదకూరపాడు, నకరికల్లు మండలాల నుంచి బియ్యం తరలింపు

రొంపిచర్ల, సెప్టెంబరు 5: మండలంలోని సుబ్బయ్యపాలెం వద్ద అద్దంకి - నార్కెట్‌పల్లి హైవే పై అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న రెండు వాహనాలను రొంపిచర్ల పోలీసులు బుధవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాల్లో వంద బస్తాల అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్నారు. రెండు వాహనాలను, ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. వీటిలో ఒక వాహనం నకరికల్లు మండలం కండ్లకుంట, మరొక వాహనం పెదకూరపాడు నుంచి వస్తున్నట్టు సదరు డ్రైవర్లు తెలిపారు. సంతమాగులూరుకు, వినుకొండకు ఈ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్టు పేర్కొన్నారు. సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు తెలియ జేసినట్టు ఎస్ఐ అశోక్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాదెండ్ల, సెప్టెంబరు 5: మండలంలోని గణపవరం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. గ్రామంలోని శాంతినగర్ కాలనీ, మరబావి సెంటర్, ఆరోగ్య కేంద్రం రోడ్డు, ఎస్సీ కాలనీ, రాజుల బజారు, మసీదు బజారు, బొడ్డురాయి సెంటర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. నాదెండ్ల సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు నాదెండ్ల, తూబాడు, చిరుమామిళ్ళ, సక్రాంతిపాడు, గొరిజవోలు, జంగాలపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

15వరకు కొండవీడుకోటకు రావొద్దు

● కలెక్టర్ అరుణ్‌బాబు

కొండవీడుకోట (యడ్లపాడు), సెప్టెంబరు 5: పర్యాటకులు సెప్టెంబరు 15వరకు కొండవీడుకోట సందర్శనకు రావొద్దని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు విజ్ఞప్తి చేశారు. మండలంలోని చారిత్రక కొండవీడుకోట ఘాట్ రోడ్డు, నగరవనాన్ని డీఎఫ్‌వో రామచంద్రరావుతో కలసి సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలను ముందుగా పరిశీలించారు. ఆర్అండ్‌బీ అధికారుల సహకారంతో జారిపడిన కొండచరియలను వీలైనంత త్వరగా తొలగించాలని డీఎఫ్‌వోకు సూచించారు. రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని, తిరిగి కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందన్నారు. ఘాట్ రోడ్డులో ప్రయాణానికి ప్రమాదం లేకుండా, కొండ చరియలు విరిగిపడవని నిశ్చయానికి వచ్చిన తరువాతనే పర్యాటకులను అనుమతించాలని సూచించారు. అనంతరం రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, అటవీశాఖల అధికారులతో సమీక్షించి, ఈ నెల 15వరకు సందర్శకులను అనుమతించరాదని నిర్ణయం తీసుకున్నారు. ఆయన వెంట నరసరావుపేట ఆర్డీవో సరోజిని, తహసీల్దార్ విజయశ్రీ, ఈవోపీఆర్డీ వరూధిని, ఆర్ఐ చక్రవర్తి, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

బాధితులకు కావాల్సింది మాటలు కాదు...చేతలు



విజయవాడ 45వ డివిజన్‌లో మెడికల్ కిట్లను పంపిణీ చేస్తున్న ప్రత్తిపాటి తదితరులు

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 5: విజయవాడ వరద బాధితులకు ఇప్పుడు కావాల్సింది చేతలు తప్ప మాటలు కాదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఏ మాత్రం మానవత్వం మిగిలి ఉంది అనిపించుకోవాలన్నా వరద ముంపు నుంచి ఇప్పుడిప్పుడే తెరిపిన పడుతున్న బాధితులకు భరోసా కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు ఎవరికి తోచిన రీతిలో వారు చేతనైనంత సాయం చేయాలని విజ్ఞప్తిచేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. స్థానిక 45వ డివిజన్ పరిధిలో మూడోరోజు వరద పరిస్థితులు, పునరావాస కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబుతో కలసి పర్యవేక్షించారు. బాధితులకు త్వరితగతిన సాయం అందేలా దిశ నిర్దేశం చేశారు. సితార జంక్షన్, జోజినగర్ తదితర ప్రాంతాల్లో బాధితులందరికీ ఆహారం, తాగునీరు అందేలా సమన్వయం చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు పరిశీలిస్తూ అప్పటికప్పుడు అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రత్యేకంగా తయారుచేసిన అత్యవసర వైద్య కిట్లను బాధితులకు అందించారు. వరద ఉధృతి శాంతించటంతో బాధితులకు సహాయక చర్యలను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా బాధితులు ఎవ్వరూ అధైర్యపడవద్దని, ప్రతి ఇంటికి ఆహారం, తాగునీరు, మందులు అందిస్తామని, కాలనీల్లో బురద తొలగింపు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి

నాదెండ్ల, సెప్టెంబరు 5: మండలంలోని గణపవరం గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై గ్రామంలోకి వస్తూ ప్రమాదానికి గురైన వలివర్తి వెంకటరామరాజు (42) గుంటూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతిచెందాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న వెంకట రామరాజుకు భార్య భాగ్యశ్రీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు నాదెండ్ల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత

వేల్పూరు (శావల్యాపురం) సెప్టెంబరు 5: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, మహిళలు క్రమంతప్పకుండా పోషకాలున్న ఆహారాన్ని తినడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేల్పూరు అంగన్‌వాడీకేంద్రంలో పౌష్టికాహారంపై గురువారం మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్రీలత మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, కోడిగుడ్లు, పాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రజలంతా మంచి ఆహారపు అలవాట్లను, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులబారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఎంపీటీసీ లింగా పున్నమ్మ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి అశోక్ చౌదరి, ఏఎన్ఎంలు అమరలింగేశ్వరి, మరియమ్మ, వీఏఏ అనూష, అంగనవాడీ టీచర్లు శేషకుమారి, నారాయణమ్మ, రాధ, సుధ, ఆశా వర్కర్లు ఈశ్వరమ్మ, మాధవి, రమాదేవి పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్, సెప్టెంబరు 5: పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా సీడీపీవో అనురాధ ఆధ్వర్యంలో మండలంలోని చీకటీగలపాలెం, చాట్రగడ్డపాడు గ్రామాలలో గురువారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. సూపర్‌వైజర్‌లు నాగరాజకుమారి, కేశవ సూరిలు తల్లులకు పోషకాహారం గురించి తెలియజేశారు. గర్భిణులు, బాలింతలకు, కిషోర బాలికలకు రక్తపరీక్షలు చేశారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

చిలకలూరిపేట సెప్టెంబరు5: చిలకలూరిపేట నుంచి చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన గుర్తుతెలియని 50 సంవత్సరాల వయసు గల ఒక వ్యక్తి గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చిలకలూరిపేట అర్బన్ పోలీసులు తెలిపారు. స్థానిక నరసరావుపేట సెంటర్‌లో అనారోగ్యంతో పడివున్న ఇతడిని పోలీసులు తొలుత చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఇటీవల తరలించారు. అతడి వివరాలు తెలిసిన వారు చిలకలూరిపేట టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తెలియచేయాలని కోరారు.

అటవీజాతి మొక్కల పెంపకాన్ని చేపట్టాలి

● ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సురేంద్రబాబు

శానంపూడి (శావల్యాపురం) సెప్టెంబరు 5: రైతులు వ్యవసాయభూమిలో ఉద్యానవన పంటలు, అటవీజాతి మొక్కలను నాటి సాగు చేయడంవల్ల అధిక దిగుబడులు సాధించి అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సురేంద్రబాబు అన్నారు. ట్రీస్ ఔట్‌సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా ప్రోగ్రాం స్టేట్ అసోసియేట్ మారపల్లి ప్రణీత్‌వర్మ నేతృత్వంలో అటవీయేతర ప్రాంతాల్లో చెట్ల పెంపకం కార్యక్రమంలో భాగంగా మండలంలోని శానంపూడి సచివాలయం వద్ద రైతులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు మాట్లాడుతూ ఉద్యానవన పంటలకు, అటవీజాతి మొక్కల పెంపకానికి ప్రభుత్వం మంచి రాయితీలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొనపాటి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, మాజీ ఎంపీపీ అమృతపూడి కోటయ్య ఏపీవో కటారపు రామారావు, ఏఈవో పూరేటి అశోక, పంచాయతీ కార్యదర్శి ముంద్రు మనోహర్, వీఏఏ ఇర్మియా తదితరులు పాల్గొన్నారు.